

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కేసులు

తాండూరురూరల్, ఫిబ్రవరి28: అనుమతులు లేకుండా దుబ్బమట్టి, ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఏఎ్‌సఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం వీరశెట్టిపల్లి నుంచి దుబ్బమట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఆయన గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. కాగ్నా నుంచి దుబ్బ, ఇసుక తరలించాలంటే తహసీల్దార్ నుంచి అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగప్ప, కానిస్టేబుల్ ధన్‌రాజ్ ఉన్నారు.

వికారాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. వికారాబాద్‌లోని సిద్ధార్థ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎనిమిది నిమిషాల లోపు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రాగా, తాండూరులో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు లేటుగా వచ్చారు. అధికారులు వారిని పరీక్షా కేంద్రం లోకి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు వెనుదిరిగారు. దిర్సంపల్లికి చెందిన విద్యార్థి పరీక్ష రాసేందుకు దోమ మండల కేంద్రానికి వస్తూ బైక్ పై నుంచి పడిపోవడంతో కాలు విరిగి పరీక్ష రాయలేకపోయాడు. మేడ్చల్ జిల్లాలో మాత్రం అందరూ సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తానికి మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



ఘట్‌కేసర్ మండలంఅవుషాపూర్‌లో పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులు



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు మేడ్చల్‌లో 1,593, వికారాబాద్ జిల్లాలో 306 మంది గైర్హాజరు

- వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వచ్చిన ఐదుగురు విద్యార్థులు.. పరీక్ష రాసేందుకు అనుమతించని అధికారులు
- దోమలో పరీక్ష రాసేందుకు వస్తూ ప్రమాదానికి గురైన విద్యార్థి
- 17 కేంద్రాలను సందర్శించిన తనిఖీ బృందాలు
- పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాటు



మోమిన్‌పేటలో నెంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థినులు

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం తొలి పరీక్ష వికారాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన పరీక్షకు జిల్లాలో 8,186 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 7880 మంది హాజరు కాగా, 306 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6788 మంది ఉండగా, వారిలో 6572 మంది హాజరు కాగా, 216 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1398 మంది హాజరు కావాల్సి ఉండగా, వారిలో 1308 మంది హాజరు కాగా, మిగతా 90 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. ఆలస్యంగా వచ్చిన ఐదుగురు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి నిర్వాహకులు అనుమతించలేదు. జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాలను తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 139 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధనతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మొదటి రోజు జనరల్ 67,539, ఒకేషనల్ 1252, మొత్తం 68,791 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా అందులో జనరల్ 66,016, ఒకేషనల్ 1182 మొత్తం 67,198 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జనరల్ 1523, ఒకేషనల్ 70 మొత్తం 1593 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు సందర్భంగా జిల్లాలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.



మేడ్చల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

ఆలస్యంగా వచ్చిన ఐదుగురు విద్యార్థులు

వికారాబాద్: వికారాబాద్‌లో 8 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తగడి బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, అనంతగిరి పల్లి బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గౌతమి, సిద్ధార్థ, సరస్వతీ, సిద్ధార్థ (బాలికల), సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే సిద్ధార్థ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎనిమిది నిమిషాల లోపు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రాగా, తాండూరులో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని అధికారులు పరీక్ష కేంద్రం లోకి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు వెనుదిరిగారు.

కాపీయింగ్ జరిగితే కఠిన చర్యలు : కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ : ఇంటర్మీడియట్ పరీక్షల్లో కాపీయింగ్ జరిగినట్లయితే ఇన్విజిలేటర్స్ చీఫ్ సూపరింటెండెంట్‌లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. ఇంటర్ పరీక్షలు నేపథ్యంలో బుధవారం వికారాబాద్‌లోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.




వికారాబాద్‌లో సిద్ధార్థ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

బైక్ అదుపు తప్పి విద్యార్థికి తీవ్ర గాయాలు

దోమ : దోమ మండలంలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన శివ దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్నాడు. మార్గంమధ్యలో పాలెపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడగా శివ కాలు విరిగింది. విద్యార్థిని దోమ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం పరిగి ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన శివ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



వికారాబాద్‌లో పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు



తాండూరులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

వావ్.. సూపర్



బషీరాబాద్, ఫిబ్రవరి 28: వావ్.. సూపర్ టాలెంట్... వన్ మినిట్ ప్లీజ్.. అంటూ ఓ విద్యార్థిని ఆపి బషీరాబాద్ ఎస్ఐ రమేష్ తన సెల్‌ఫోన్‌లో ఎగ్జిబిట్‌ను బంధించారు. తాండూరు పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విధులకు హాజరైన ఎస్ఐ, నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించేందుకు 4వ తరగతి విద్యార్థి ఆదిత్య తీసుకెళ్తున్న ఎగ్జిబిట్‌ను చూసి ముచ్చట పడి ఫొటో తీసుకున్నారు. అంతేకాకుండా వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు వివిధ రకాలు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల ఎగ్జిబిట్‌లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని పలువురు ఉపాధ్యాయులు సూచించారు.

కొడంగల్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ వర్తింపు

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 28: జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని కలెక్టర్ సీ.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఈవీఎంల గిడ్డంగి ఆవరణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహబూబ్ నగర్ శాసనమండలి ఎన్నికను పురస్కరించుకొని కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొమ్మరాస్‌పేట్ , దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలకు ఎన్నికల కోడ్ వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలనపై ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో సీఈవో ఎం.సుధీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతేకాకుండా నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి రావడానికి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బుధవారం వికారాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీసీ రోడ్లు పూర్తి చేయాలి

జిల్లా లో సీసీ రోడ్లకు సంబంధించి నిర్మాణా పనులను నాణ్యతతో పూర్తి చేయాలనీ కలెక్టర్ నారాయణరెడ్డి డీఈ, ఏఈలకు ఆదేశించారు. బుధవారం టెలికాన్ఫరెన్సు ద్వారా అధికారులలో మాట్లాడారు. జిల్లాలో మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మార్చి 15 లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధిహామీలో భాగంగా గ్రామాల్లో లేబర్ సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉమేష్, శ్రీరాములు, డీఈలు పాల్గొన్నారు

పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అడుగులు!

- బషీరాబాద్ మండలంలో భూసేకరణకు కసరత్తు!
- రెండు రోజులుగా రెవెన్యూ అధికారుల బిజీబిజీ
- మండల వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

బషీరాబాద్, ఫిబ్రవరి 28: కాలుష్య రహిత పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. బషీరాబాద్ మండలం మాసన్‌పల్లి శివారు ప్రాంతంలో ఇండస్ట్రీయల్ పార్కు కోసం ప్రభుత్వ భూమిని టీఎస్ఐసీసీ(తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల కల్పన సంస్థ)కి అప్పగించేందుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా ఆయా భూముల్లో సర్వే నిర్వహించి రైతులను గుర్తించే పనిలో పడ్డారు. రెండేళ్ల కిందట మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, టీఎస్ఐసీసీ ఎండీ.వెంకట నర్సింహరెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం అధ్యయనం చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఇండస్ట్రీయల్ పార్కు కోసం నవాల్గ, కొర్విచెడ్, కొర్విచెడ్‌ఘని, ప్రాంతంలోని సర్వే నంబరు 76లో 96.02, ఎకరాలు, 101లో 71.05 ఎకరాలు, 112లో 53.06 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఈ క్రమంలో మళ్లీ మాసన్‌పల్లి శివారులోని సర్వే నంబర్లు 2,3,4,5,6,7,8,9,13లలో 48.38 ఎకరాల భూములకు సంబంధించి సర్వే రిపోర్టు, రైతుల వివరాలు ఇవ్వాలని రెవెన్యూ ఉన్నతాధికారులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ ఆదేశానుసారం ఆర్ఐ రాకేష్, సర్వేయర్ ప్రభు మంగళవారం, బుధవారం రెండు రోజులు క్షేత్ర స్థాయిలో భూములను సర్వే చేశారు. కబ్జాలో ఉన్నా రైతులను పిలిపించి ఆర్ఐ రాకేష్ వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం ఎట్టకేలకు ఇండస్ట్రీయల్ ఏర్పాటుకు మళ్లీ కసరత్తు ప్రారంభించడంతో మండల వాసుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి.



మాసన్‌పల్లి శివారులో భూ సర్వే చేసి రైతుల వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ, సర్వేయర్లు

బషీరాబాద్ ప్రాంత వాసులకు ఉపాధి..

వికారాబాద్ జిల్లాలోని బషీరాబాద్ మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోఉండడంతో అన్ని రంగాల్లో వెనుకబడింది. మండల వాసులకు స్థానికంగా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. మండల పరిధిలోని మాసన్‌పల్లి శివారులో పారిశ్రామికవాడకు నాపరాళ్ల పరిశ్రమలు తరలివస్తే స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. తాండూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో సుమారు 500 వరకు పాలిషింగ్ యూనిట్లు, ఇతర చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పారిశ్రామికవాడను ఏర్పాటు చేసి పాలిషింగ్ యూనిట్లను తరలిస్తే వందలాది మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

నేడే ఆఖరు!

నేటితో ముగియనున్న రేషన్ కార్డుకు ఈకేవైసీ

- రేషన్ డీలర్లు అందుబాటులో లేని చోట్ల మందకొడిగా ఎంట్రీ
- మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 90శాతం, వికారాబాద్ జిల్లాలో 80 నమోదు
- ఈ - కేవైసీ చేసుకోకపోతే వచ్చే నెల నుంచి రేషన్ కట్?

వికారాబాద్/మేడ్చల్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అర్హులకే రేషన్ సరుకులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ కార్డుల్లో నమోదైన నకిలీ లబ్ధిదారులను ఏరివేసేందుకు చర్యలు తీసుకుంటోంది. రేషన్ లబ్ధిదారులకు ఈ-కేవైసీ నమోదు చేయడం ద్వారా నకిలీలకు చెక్ పెట్టనున్నారు. రేషన్ కార్డుల్లో నమోదైన లబ్ధిదారుల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. ఇప్పటికే గడువును రెండు పర్యాయాలు పొడిగించిన ప్రభుత్వం ఈనెల 29వ తేదీ వరకు గడువు పొడిగించింది. రేషన్ లబ్ధిదారులు ఈ -కేవైసీ చేసుకునేందుకు ప్రభుత్వం రెండు పర్యాయాలు గడువు పొడిగించినా. ఈసారి కూడా పూర్తి స్థాయిలో ఈ-కేవైసీ నమోదుకు దూరంగానే ఉంది. జిల్లాలో 588 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 2,41,185 రేషన్ కార్డులు ఉండగా, 8.09 లక్షల మంది మంది రేషన్‌సరుకులు పొందుతున్నారు. ఆహార భద్రతా కార్డులు 2,14,284 ఉండగా, అంత్యోదయ 26,865, అన్నపూర్ణ కార్డులు 36ఉన్నాయి. ఈ కార్డుదారుల్లో ఇప్పటి వరకు 1,92,.948 రేషన్ కార్డుల్లో నమోదైన లబ్ధిదారులు తమ వేలిముద్రలు నమోదు చేసుకోగా, ఇంకా 48,237 రేషన్‌కార్డుల్లో నమోదైన లబ్ధిదారులు తమ ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 80 శాతం మాత్రమే ఈ కేవైసీ పూర్తయింది. మేడ్చల్-మల్కాజ్‌గిరిజిల్లాలో ఇప్పటికీ 90 శాతం రేషన్‌కార్డుకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 5,23,938 ఆహారభద్రత కార్డులు, 17,18,351 మంది సభ్యులుండగా 90శాతం మందివి వేలిముద్రలు తీసుకున్నారు.

ఆలస్యానికి ప్రచార లోపం కారణం

జిల్లాలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన రేషన్‌దారుల ఈ-కేవైసీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రచార లోపం కారణంగా రేషన్ కార్డు లబ్ధిదారుల వేలి ముద్రల నమోదు ప్రక్రియ సజావుగా ముందుకు కొనసాగడం లేదు. వృద్ధుల వేలి ముద్రలు కూడా సక్రమంగా నమోదు కావడం లేదు. అర్హులై వేలిముద్రలు (ఈ కేవైసీ) నమోదు కాని వారి వివరాలను నమోదు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తూ సర్కారు జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీఎస్‌వో, టీఎస్‌సీ ఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ అర్హులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, కదలలేని పరిస్థితుల్లో ఉంటే వారి ఇంటికి వచ్చి ఈకేవైసీ చేయనున్నారు.

దూర ప్రాంతాల్లో లబ్ధిదారులు

ప్రతి రేషన్ దుకాణం పరిధిలో 10 నుంచి 20 శాతం మంది వరకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. స్థానికంగా అందుబాటులో లేని ఇలాంటి వారు ఈ కేవైసీ నమోదుకు దూరంగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తాము సరుకులు తీసుకునే డీలర్ వద్ద వేలిముద్రలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. రేషన్ డీలర్లు అందుబాటులో లేక కొన్ని చోట్ల ఈ ప్రక్రియ మందకొడిగా కొనసాగుతోంది. అవగాహన కల్పించకపోవడం ప్రధాన కారణంగా చెబుతున్నారు. రేషన్‌కార్డుకు ఈ కేవైసీ పూర్తి చేసుకోకపోతే బియ్యం సరఫరా నిలిచిపోనుంది.



రేషన్ వివరాలు

జిల్లా	రేషన్ కార్డులు	లబ్ధిదారులు	బియ్యం సరఫరా (మె.ట)
వికారాబాద్	2,41,185	8,00,009	5337.315
మేడ్చల్	5,23,938	17,18,351	10,020

‘మా భూములను స్వాధీనం చేసుకోవద్దు’

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 28: దుద్యాల మండలం హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల్లో మందుల కంపెనీలకు తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని ఆ గ్రామాల ప్రజలు అన్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను దుద్యాల తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ మందుల కంపెనీలను సాగు భూముల్లో కాకుండా ప్రభుత్వ, బంజరు భూముల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కంపెనీల ఏర్పాటుతో భూములపై ఆధారపడి జీవిస్తున్న తమ నోట్లో మట్టి కొట్టొద్దని అన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

పరిగి, ఫిబ్రవరి 28: మునిసిపల్ పరిధి ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి పరిగి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది పెండింగ్‌లో పన్నులతో కలిపి మొత్తం రూ.2.4కోట్లు ప్రజలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏటా రూ.1.5కోట్ల పన్ను రాబడి రావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.90లక్షల వసూలు జరిగిందని తెలిపారు. కోటిన్నర పన్నులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మార్చి ఆఖరు నాటికి వందశాతం పన్నులు వసూలు చేసేలా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి వసూలు చేసూలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటి, వ్యాపార పన్నులు కూడా చెల్లించాలని సూచించారు. గడువులో చెల్లించిన వారికి నోటీసులు ఇస్తామని, వాటికి కూడా స్పందించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెల్లించాలని ఆయన పట్టణవాసులను కోరారు.

రూ.23.35కోట్లతో దమ్మాయిగూడ మున్సిపల్ బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత

కీసర రూరల్, ఫిబ్రవరి 28: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత అన్నారు. బుధవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.23.35కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ తీర్మానించిందన్నారు. పన్నుల ద్వారా రూ.8.2కోట్లు, ఇళ్ల నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్సులు, తదితరాల ద్వారా రూ.13.72కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.90లక్షలు,ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.23.35కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశామన్నారు. ఈ మొత్తాన్ని హరితహారం నిర్వహణ, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, వివిధ అభివృద్ధి పనులు, బీసీ సంక్షేమానికి, పరిపాలన ఇంజినీరింగ్ నిర్వహణ తదితరాలకు వెచ్చిస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

మేడ్చల్ పారిశ్రామిక వాడ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్ ప్రారంభం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28 : మేడ్చల్ పారిశ్రామిక వాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్‌ను విద్యుత్ శాఖ సీజీఎం సాయిబాబ బుధవారం ప్రారంభించారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా ఫీడర్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా సాయిబాబ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్రీరాంమోహన్, శ్రీనాథ్ రెడ్డి, ఏడీఈ, ఏఈ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం సాయిబాబ

నేటి నుంచి జినుగుర్తిలో ప్రతిష్ఠాపనోత్సవాలు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 28 : తాండూరు మండలం జినుగుర్తిలో సింధూర గణపతి ఆలయ ప్రారంభోత్సవం, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. నేడు గణపతి పూజతో పూజలు ప్రారంభం అవుతాయన్నారు.

ఆర్. కృష్ణయ్యతో పట్నం దంపతుల భేటీ



కృష్ణయ్యతో పట్నం దంపతులు, నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యతో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలపై చర్చ జరిపారు. తాను కూడా వికారాబాద్ జిల్లా వాస్తవ్యుడినేని, పట్నం కుటుంబంతో తనకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని కృష్ణయ్య చెప్పారు. పట్నం దంపతులు ఎప్పుడూ ప్రజాసేవలో ఉంటారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను పట్నం దంపతులు సన్మానించారు. బీసీ సంఘం నాయకుడు లాల్‌కృష్ణ, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా అంద్యానాయక్ రాజీనామా



మాట్లాడుతున్న సునీతా అంద్యానాయక్

మహేశ్వరం, ఫిబ్రవరి 28 : మహేశ్వరం మండల ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న ఆర్. సునీతాఅంద్యానాయక్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై గౌరవంతో బీఆర్‌ఎస్‌లో కొనసాగామని చెప్పారు. కానీ మండలంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తమను అడుగడుగునా అవమానాలకు గురి చేశారని, దీంతో తీవ్ర మనస్థాపానికి గురై పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామన్నామని ప్రకటించారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని వారు ప్రకటించారు.

భూ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండదు

● వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి

దోమ, వికారాబాద్, ఫిబ్రవరి 28: భూవివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అటువంటి వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, కోర్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి లిఖితపూర్వకంగా ఆదేశాలు ఉంటేనే తమ ప్రమేయం ఉంటుందని చెప్పారు. వికారాబాద్ జిల్లా పరిగి డివిజన్ దోమ మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నెం.50/ఏ/1లో గల మొత్తం 1.09 ఎకరాల భూమిని 2018వ సంవత్సరంలో ఉదాన్‌రావుపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అయూబ్ అనే వ్యక్తి తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమ రాములమ్మ దగ్గరి నుంచి కొనుగోలు చేశాడన్నారు. కానీ కబ్జాలోకి వెళ్లలేదని, ఇట్టి భూమి విషయంలో చీమ రాములమ్మ, ఆమె కుటుంబ సభ్యులు, సయ్యద్ అయూబ్‌కు మధ్య తగాదాలు జరుగుతున్నాయన్నారు. 2021 ఆగస్టు 2న ఆగ్రామానికి చెందిన సత్తయ్య ఫిర్యాదుతో రాములమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై దోమ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగిందన్నారు. వారు జైలులో ఉన్న సమయంలో అయూబ్ అట్టి భూమి చుట్టు కనీలు పాతారని చెప్పారు. వారు జైలు నుంచి విడుదలయ్యాక ఆ పొలంలోకి వెళ్లి వ్యవసాయం చేయడం, రాములమ్మ కుమారుడు చీమ గోవర్ధన్ చనిపోవడంతో అతని మృతదేహాన్ని పొలంలో పూడ్చి పెట్టడం జరిగిందన్నారు. తిరిగి 2024 ఫిబ్రవరి 5న ఆ భూమి విషయంలో గొడవలు జరగడంతో సయ్యద్ అయూబ్ దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందని చెప్పారు. భూవివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. అయితే కొంత మంది ప్రజా సంఘాల నాయకులు వారి స్వలాభం కోసం అట్టి భూమిని అయూబ్‌కు కబ్జా ఇప్పించాలని పోలీసులపై వత్తిడి తీసుకువస్తూ, పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయిస్తూ తమను కించపరిచే విధంగా కథనాలు, అవాస్తవాలు ప్రచురిస్తున్నారని చెప్పారు. పోలీసులపై తప్పుడు కథనాలు, అవాస్తవాలు ప్రచురిస్తున్న వారికి, యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి, పరువు నష్టం కేసులతో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీస్ వార్షిక బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

పోలీస్ వార్షిక బులెటిన్ ఆవిష్కరణ

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా పోలీసులు 2023 సంవత్సరంలో ఛేదించిన కేసులు, సాధించిన లక్ష్యాలు, చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, వారు చేసిన మంచి పనులు తదితర విషయాలతో రూపొందించిన వార్షిక బులెటిన్‌ను ఎస్పీ కోటిరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జోతిర్మనీ, వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీసీబీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ అంజాత్ పాషా, ఎస్సైరాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి కసరత్తు!

● చర్చనీయాంశంగా ఈటల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

మేడ్చల్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థుల కసరత్తు తుది దశకు చేరుకుంది. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థి పేరును ప్రకటించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే మల్కాజిగిరి ఎంపీ స్థానానికి దాదాపు అరడజను మంది పోటీలో ఉండగా, వివిధ సర్వే నివేదికలతో తుది పేరును ఎంపికచేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడొకరు వెల్లడించారు. ఇప్పటి వరకు మల్కాజిగిరి పార్లమెంటు స్థానంపై పాగా వేయని బీజేపీ ఈ దఫా ఎలాగైనా కైవసం చేసుకోవాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కాగా మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో పోటీ చేసేందుకు బీజేపీలో తీవ్ర పోటీ నెలకొన్న విషయం విదితమే. కాగా బుధవారం ఆ పార్టీ నేత ఈటల రాజేందర్ ఓఆర్ఆర్ పక్కన పూడూరు పరిధిలోని తన నివాసంలో కార్యకర్తలకు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేయడం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. మల్కాజిగిరి టికెట్ తనదేనంటూ ఈటల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేశారనే ప్రచారం జోరందుకోవడంతో అధిష్ఠానం ప్రకటించకముందే టికెట్ తనకేనని ఈటల ఎలా ప్రకటించుకుంటాడంటూ ఇతర ఆశావహులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. ఈటల ఇంటి వద్ద ప్రతి రోజు కార్యకర్తలకు బ్రేక్ ఫాస్ట్ ఉంటుందని లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని ఈటల మద్దతుదారులు కొట్టి పరేశారు. బుధవారం ఈటెల నివాసం వద్ద మాత్రం కార్యకర్తలతో పెద్ద ఎత్తున కోలాహలం నెలకోవడం గమనార్హం.



ఈటెల నివాసం వద్ద అభిమానుల కోలాహలం

బీఆర్‌ఎస్‌కు పనిచేసిన నాయకులొద్దు

యాలాల, ఫిబ్రవరి 28 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోసం పనిచేసి ఎన్నికలయ్యాక కాంగ్రెస్ పార్టీలో చేరే నాయకులు తమకు అవసరం లేదని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం కేంద్రంలోని బాకార ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అనుచరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండలానికి చెందిన మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి కోసం పనిచేశారని చెప్పారు. ఆయన ఓడిపోవడంతో వారి స్వార్థం కోసమే చేవెళ్లలో జరిగిన ముఖ్యమంత్రి సభలో వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. కనీసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సమాచారం ఇవ్వలేదని, వారి చేరికతో పార్టీకి ఏలాభం లేదని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని త్వరలోనే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి, అక్బర్‌బాబా, చెన్నారం అనిల్‌కుమార్, హనుమంతు, మనిద్దీన్ నాగయ్య, షైపాల్ ,అహ్మద్, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణలో పురోగమనంలో పట్టు ఉత్పత్తి

●జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి సత్తార్

వికారాబాద్, ఫిబ్రవరి 28 : తెలంగాణలో పట్టు ఉత్పత్తి పురోగమనంలో ఉన్నదని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎంఏ సత్తార్ అన్నారు. మంగళవారం ఆ శాఖ ఆధ్వర్యంలో పట్టు, మల్బరీ సాగుపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా మల్బరీ, కూరగాయల సాగు చేయాలని చెప్పారు. మల్బరీ బహువార్షిక పంట అని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. దాని వల్ల సంవత్సరంలో ఐదుగురికి ఉపాధి కల్పించవచ్చని అన్నారు. వికారాబాద్ ప్రాంతంలో మంచి ఎర్రచల్క భూములు ఉండడం ఉద్యాన పంటలకు అనుకూలిస్తుందని, హైదరాబాద్‌కి సమీపాన ఉన్నందున కూరగాయల సాగు కూడా చేపట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాఘవేందర్, వినోద్‌కుమార్ యాదవ్, పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు మల్లికార్జున్, ఉద్యాన అధికారులు కలమ, జయంతి, అబ్దుల్ గఫూర్, అర్చన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు విజయ్‌కుమార్, తుయమని, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎంఏ సత్తార్

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థం

ధారూరు, ఫిబ్రవరి 28 : గ్రామాలలో సిమెంట్, కంకర రోడ్ల నిర్మాణానికే ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చి, మురుగుకాల్వల నిర్మాణాన్ని విస్మరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో నేటికీ గ్రామాలను డ్రైనేజీ సమస్య వెంటాడుతోంది. ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురికి కాల్వల నిర్మాణానికి నిధులు ఇవ్వటంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మురుగుకాల్వలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రోడ్లపై నిలువటంతో గుంతలు పడి రోడ్లు పాడవుతున్నాయి. మడుగులుగా మారి అపరిశుభ్రత నెలకొనడంతో పాదాచారులకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారా వంటి రోగాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. కాగా మురుగుకాలువలు సరిగా లేక గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణ ప్రజాప్రతినిధులకు, అధికారులకు సవాలుగా మారింది. ఎన్నికల ప్రచారానికి వచ్చిన పార్టీల నాయకులను గతంలో ఆయా గ్రామాల ప్రజలు ఈ సమస్యపై నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. కాలువలు నిర్మించిన తర్వాతే రోడ్లను నిర్మించేవారని ప్రస్తుతం వాటి ఊసేలేదని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఇళ్ల సమీపంలో నిలిచిన మురుగునీరు

మురుగుకాల్వలు లేక రోగాలు



ధారూరులోని కుక్కింద రోడ్డులో ఉన్న మా కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. అపరిశుభ్రతతో కాలనీ వాసులకు రోగాలు వస్తున్నాయి. మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచి నడవటానికి ఇబ్బంది కలుగుతోంది. దోమలు, ఈగలు పెరగడం వల్ల రోగాలు వస్తున్నాయి. కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు కోరినా స్పందించటంలేదు.

- శ్రీకాంత్, ధారూరు

ఏ క్షణంలోనైనా.. కుప్పకూలే ప్రమాదం

●టాకీ తండాలో శిథిలావస్థకు చేరిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

●అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

బషీరాబాద్, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని టాకీ తండాలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఈ ట్యాంక్‌కు పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతుండడటంతో ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు పిల్లర్లకు పలుచోట్ల పెచ్చులూడి ఇనుప రాడ్లు(చువ్వలు) కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని సమీప ఇళ్ల ప్రజలు భయంభయంగా కాలం గడుపుతున్నారు. నిత్యం ఈ ట్యాంకు ద్వారానే నీరు సరఫరా చేస్తుండటంతో లోడ్ ఎక్కువై కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. దీనికి సమీపంలోనే అంగన్‌వాడీకేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉండటంతో చిన్నారులు ట్యాంకు కిందకు చేరుకుని ఆటలాడుతుంటారని స్థానికులు చెబుతున్నారు. ఏ ప్రమాదం జరుగకముందే తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ నరేష్ చౌహాన్ సంబంధిత అధికారులను కోరారు. ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్తామని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



శిథిలావస్థలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి

●జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి

చేవెళ్ల, ఫిబ్రవరి 28 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖారాలకు చేరుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి అన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో జరిగిన సిల్వర్ డైల్ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి ప్రపంచంలో సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేవిధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులో మరింత ముందుకు రావాలన్నారు. పాఠశాల చైర్మన్ మోహనచారి, ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, బోజిరెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యాయులు కళ్యాణి, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న భాస్కరయోగి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

షాబాద్, ఫిబ్రవరి 28 : పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సర్దార్‌నగర్, పోతుగల్, తాళ్లపల్లి, హైతాబాద్, మన్‌మర్రి గ్రామాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 2వేల 500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేందర్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు ఉపేందర్, రవి, ప్రశాంత్, రఘు, రాములు, బిక్షపతి, లింగం, కిరణ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న రాము, రవీందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28 : ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేసిన సందర్భంగా క్లబ్ సెక్రటరీ కెవి రమేష్‌రాజు లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ 320సి రీజియన్ చైర్‌పర్సన్ లయన్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా బుధవారం ఉత్తమ క్లబ్ అవార్డునందుకున్నారు. మున్ముందు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని శ్యాంప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇందూరి శ్రీనివాస్, ట్రెజరర్ గుంటి భీంరావుతోపాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి విస్తృత పర్యటన

ఆమనగల్లు, ఫిబ్రవరి 28 : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బుధవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొల్కులపల్లి, నాగిళ్ల పాఠశాలల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నూదిని కొండల్ రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హన్మానాయక్, విజయ్‌రాథోడ్, వెంకటయ్య, శ్యామ్‌సుందర్ రెడ్డి, కృష్ణ, యాదయ్యగౌడ్, రాజేందర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

● వివిధ ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థులు


దోమ: బొంపల్లి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దోమ, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు పలు విధాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రతిభచూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు బహుమతులు అందజేసి అభినందించారు. దోమ మండలం బొంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ఉపాధ్యాయులు పరిశీలించారు. సైన్స్ క్విజ్, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సైన్స్‌తోనే దేశం అభివృద్ధి జరుగుతుందని, కరోనా వంటి కష్ట కాలంలోనూ మన శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ తయారు చేసి ఎన్నో దేశాల ప్రజలను కాపాడారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మాధురి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం షఫీ, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, విజయ్‌సాయి పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. చంద్రశేఖర వెంకట్రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, సుదీక్షస్కూల్, భృంగి విద్యాలయాల్లో పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సుదీక్ష స్కూల్‌లో సైన్స్, మ్యాథ్స్ ఫెయిర్, కూరగాయల సంతను నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. సుదీక్ష డైరెక్టర్ వీరేశం మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫేర్ దోహదపడుతుందన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అమర్‌నాథ్ సూచించారు. జడ్పీహెచ్‌ఎస్:2లో విద్యార్థులు 40కి పైగా ప్రయోగాలను ప్రదర్శించారు. పాల్గొన్న అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి ఎదగాలన్నారు. సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌పై వివరించారు.

కులకచర్ల: కులకచర్లలోని కేవీఎం పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రయోగాలను బీజేపీ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు, తహసీల్దార్ మురళీధర్, ఎంఈవో హబీబ్ అహ్మద్ పరిశీలించారు. హెచ్‌ఎం సాయి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ రెయిన్‌బో పాఠశాలలో విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు.


పరిగి జడ్పీహెచ్‌ఎస్ నం:2 సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


పూడూరులో ప్రదర్శనలను తిలకిస్తున్న సెహగల్ ఫౌండేషన్ చీఫ్ శ్రుతి

కరస్పాండెంట్ రాఘవేందర్‌యాదవ్ మాట్లాడుతూ మానవళి అభివృద్ధికి సైన్స్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు శ్యామ్, ఫైమద్, పార్వతి, కవిత, స్వరూప, సనా, శ్రీవాణి, నవనీత, సమ్రీన్, రూపవతి, శ్రీలత పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్లు ఎంతగానో దోహద పడుతాయని సెహగల్ ఫౌండేషన్ చీఫ్ శ్రుతి అన్నారు. మండలంలోని పూడూరు పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ఆమె విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలకు తిలకించారు. సాంకేతికతను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కషిచేయాలన్నారు. కార్యక్రమంలో పూడూరు కాంప్లెక్స్ పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య, సైన్స్ ఉపాధ్యాయుడు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర: కీసరలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు పలు ఆవిష్కరణలను రూపొందించారు. ప్రయోగాలను పరిశీలించిన ఎంఈవో శశిధర్ బహుమతులు అందజేశారు.

కొడంగల్: కొడంగల్‌లోని నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. సైన్స్ గురించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం రాములు, పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, కరస్పాండెంట్ డి.లక్ష్మి, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంట్వారం(కోట్‌పల్లి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని బార్వాద్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటరత్నం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచంద్రయ్య, అనిత, రాజశేఖర్, విజయ, ఫరూక్, కిష్టయ్య పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంటలోని ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలు ఎంఈవో వసంతకుమారి తిలకించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పరికరాల గురించి వివరించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చితే జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, తిరుమలేష్, మేరి, నాగశారద, వనజ, శ్రీదేవి, శైలజ, మంజుల, రజిని, అమీనాబి పాల్గొన్నారు.


తూంకుంట ఉన్నత పాఠశాలలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈవో వసంతకుమారి

మానవ సేవే మాధవ సేవ


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కేబీఎస్ బ్యాంకు అధికారులు

కొడంగల్, ఫిబ్రవరి 28 : కేబీఎస్ బ్యాంకు కొడంగల్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో అంబులెన్స్‌ను అందించారు. బుధవారం కేబీఎస్ బ్యాంక్ హైదరాబాద్ ఎండీ దుర్గాప్రసాద్, సీజీఎం సత్యనారాయణ, సీఎఫ్‌వో మురళీకృష్ణ, కొడంగల్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది అంబులెన్స్‌ను అందజేశారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కొడంగల్ బ్రాంచి పరిధిలో ఏడాదికి రూ.36కోట్ల టోర్నవర్ బిజినెస్ నడుపుతున్నామని, ప్రజాసేవలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌ను అందజేశామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో డోర్ టు డోర్ సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెంట్ చంద్రప్రియ, సమాచార అధికారి వీణ, సహాయ అధికారి శివకుమారి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


వధూవరులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 28:పట్టణంలోని పలు వివాహ, ఇతర శుభ కార్యాల్లో బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో జాక వెంకటేశ్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని జరిగిన పలు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

బుర్హాన్‌పూర్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 28: మండలంలోని బుర్హాన్‌పూర్ పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. హెచ్‌ఎంగా మహేశ్వరి, ఎంఈవోగా వంశీగౌడ్, డీఈవోగా వెంకటేశ్, టీచర్లుగా 13 మంది వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, టీచర్లు విజయలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 28: నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. అప్పిరెడ్డిపల్లి, బాలంపేట్, కోస్గి, చంద్రకల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ గ్రామాల వారికి ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివ స్వాముల పాదయాత్ర


శ్రీశైలానికి వెళ్తున్న లక్ష్మీపల్లి శివస్వాములు

కొడంగల్ రూరల్/కులకచర్ల, ఫిబ్రవరి 28: కొడంగల్ మండలం లక్ష్మీపల్లికి చెందిన శివ స్వాములు, గ్రామస్తులు బుధవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు గ్రామ శివాలయంలో పూజలు నిర్వహించారు. శివస్వాములు మాట్లాడుతూ శివరాత్రి నాడు శ్రీశైలంలో మల్లికార్జునస్వామి దర్శనంతో దీక్ష విరమిస్తామని తెలిపారు. అలాగే కులకచర్ల మండలం బండవెల్కిచర్ల నుంచి శివస్వాములు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పాంబండ ఆలయంలో అర్చకులు పాండుశర్మ ఇరుముడులు కట్టారు. 20మంది శివస్వాములు శ్రీశైలం బయల్దేరారు. కుటుంబీకులు వారిని పాంబండ ఆలయం వద్ద సాగనంపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్యోతి, లక్ష్మీగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నర్సరీ స్థలం మాయంపై విచారణ జరపాలి'

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 28 : ఘట్‌కేసర్ పరిధిలోని ప్రైమ్ ల్యాండ్ వెంచర్‌లో గల సర్వే నంబర్ 127లో అన్యాక్రాంతం అయిన నర్సరీని కాపాడలని కౌన్సిలర్ బర్ల శశికళదేవేందర్ బుధవారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి చెందిన కమాన్(స్వాగత తోరణం), శిలాఫలకం, నర్సరీలోని వేలాది మొక్కలను మాయం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.కోట్ల విలువ చేసే 9,560 చదరపు గజాల స్థలాన్ని ఓ వ్యక్తి తన ఆధినంలో ఉంచుకున్నాడని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కందకట్ల మాధవరెడ్డి మున్సిపాలిటీ వస్తువులను తొలగించడం సరికాదన్నారు. 2020 సెప్టెంబరులో అక్కడ నర్సరీని ఏర్పాటు చేస్తే ఇప్పుడు ఆ స్థలం తనదని చెప్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. దాదాపు రూ.30లక్షలు వెచ్చించి నిర్మించిన నర్సరీని ధ్వంసం చేయడంపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

కొనసాగుతున్న వైదిక పూజలు


ఆలయంలో శాంతి పూజ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

కీసర, ఫిబ్రవరి 28: చీర్యాల్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గంగాభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం మూడో రోజు గవ్యాంత పూజలు, చండీ పారాయణం, చండీ హోమం, రుద్రహోమం, దేవతా మూలమంత్రం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రరెడ్డి, మాల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే బాబూమోహన్ పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామికి వారు పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ వారికి స్వామివారి జ్ఞాపికలు, అర్చకులు తీర్థ ప్రసాదాలు, అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటేష్, ఎంపీపీ ఇందిర, హరిగౌడ్, మహేందర్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి'

బంట్వారం, ఫిబ్రవరి 28: బీఆర్ఎస్, బీజేపీల నాయకుల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగం రాజుస్వామి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయ్యిందని, ఇప్పుడే ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వంపై ఏదో ఒక సాకుతో బురదజల్లుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్లలో ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఇప్పటికే 4 హామీలను అమలు చేశామన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొందరు విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారం చేస్తున్నారని, విద్యుత్ పనుల కోసం లైన్ క్లియర్ తీసుకున్నా కరెంటు కోతలు విధిస్తున్నారని ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


తాండూరు రూరల్: తాండూరులోని చైతన్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

తాండూరు రూరల్/దోమ/మోమిన్‌పేట్/కొడంగల్ రూరల్/మర్పల్లి/ఘట్‌కేసర్ రూరల్/పరిగి/కులకచర్ల/మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మొదటి సంవత్సరం పరీక్ష జరిగింది. తాండూరు 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2429 మంది విద్యార్థులకు 75 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ కస్టోడియన్లు మల్లినాథప్ప, కృష్ణయ్య తెలిపారు. దోమలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షలను పర్యవేక్షించారు. మొత్తం 167 మంది విద్యార్థులకు 155 మంది పరీక్ష రాశారు. మోమిన్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 150 మంది విద్యార్థులకు 140 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెన్నయ్య తెలిపారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 651మంది విద్యార్థులకు 625 మంది హాజరయ్యా రని పరీక్షల చీఫ్ సూపరిండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులకు 9మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఘట్‌కేసర్ మం డలం అవుషాపూర్ అల్ఫోర్స్ జూనియర్‌కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల్లో ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీచైతన్య కాలేజీలో 486 మందికి 452 మంది, అల్ఫోర్స్‌లో 583మందికి 566 విద్యార్థులు పరీక్ష రాశారు. పరిగిలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్, విజ్ఞాన్, పల్లవి జూనియర్, మోడల్ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఆనంద్‌రావు, డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కులకచర్లలో రామలింగేశ్వర కళాశాలలో 244 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరయ్యారు. వివేకానంద కళాశాలలో 204 మంది విద్యార్థులకు 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను పరిగి డీఎస్పీ, సీఐ, తహసీల్దార్ మురళీధర్ పరిశీలించారు. వారి వెంట ఎస్సై అన్వేష్‌రెడ్డి ఉన్నారు. ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు మేడ్చల్‌లో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో 6సెంటర్లను ఏర్పాటు చేశారు. 1,974 మంది విద్యార్థులకు 1,906 మంది పరీక్షకు హాజరయ్యారు. నిర్దేశిత సమయానికి ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.


మేడ్చల్‌లోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


నూతన కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న మల్లికార్జున్

కొడంగల్, ఫిబ్రవరి 28: కొడంగల్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని బుధవారం మండల ఇన్‌చార్జి ఆర్.అంజి ఆధ్వర్యంలో సమితి జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దోమ అశోక్, ఉపాధ్యక్షుడు టి.సిద్ధు, అధికార ప్రతినిధి కె.నాగప్ప, ప్రధాన కార్యదర్శి కె.మధు, కార్యదర్శి టి.నరహరి, ప్రచార కార్యదర్శి శివకుమార్, కోశాధికారి చందు, సలహాదారులు భీమప్ప, కార్యవర్గ సభ్యులుగా మహేశ్, అశోక్, నవీన్, రాములును ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మల్లికార్జున్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలపర్చేందుకు కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, అధికార ప్రతినిధి ప్రకాశ్, శివాజీ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మల్లేశం

పూడూరు, ఫిబ్రవరి 28 : ప్రత్యేకాధికారులు రోజూ గ్రామాలను సందర్శించాలని ఎంపీపీ మల్లేశం అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతకు గ్రామాల్లో నీటి కొరత రాకుండా చూడాలని సూచించారు. అనంతరం అధికారులు సమాచారాన్ని చదివి సభ దృష్టికి తెచ్చారు. అనంతరం నూతన ఎంపీడీవో పాండును సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ మేఘమాల, వైస్ఎంపీపీ షైపాల్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28 : మేడ్చల్‌లోని ఆర్టీసీ డిపో సమీప కాలనీలో నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. కమిషనర్ నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ వార్డులను సందర్శించి అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణ దారులకు టీపీవో నోటీసులు జారీ చేశారు. నిర్మాణ దారుల నుంచి సరైన సమాధానం రాక పోవటంతో కొన్ని భవనాల నిర్మాణాలను తొలగించారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

పూడూరు, ఫిబ్రవరి 28 : ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థుల సౌకర్యార్థం గ్రామాల నుంచి ఉదయం పూట బస్సులను నడపాలని కాంగ్రెస్ జిల్లాప్రధాన కార్యదర్శి పెంటయ్య బుధవారం పరిగి ఆర్టీసీ డీఎం వినతి పత్రం అందజేశారు. రంగాపూర్, సోమన్‌గుర్తి, దేవనోన్‌గూడెం, రాకంచర్ల, తిర్మలాపూర్ గ్రామాల నుంచి విద్యార్థులు ఇంటర్ పరీక్షల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. వారు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8గంటలకే చేరుకోవాల్సి ఉన్నందున ఆయా గ్రామాలకు 7:40గంటలకే బస్సులు నడపాలని కోరారు. ఉదయం వేళల్లో బస్సులు సర్వీసులు వేయాలని కోరారు. అనంతరం పెంటయ్య నంచర్లలో జరిగిన మేము సైతం యువత కోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

మృతుడి కుటుంబానికి కేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 28: కులకచర్లలో మంగళవారం రాత్రి వడ్డె వెంకటయ్య(55) అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శరత్‌కుమార్‌రెడ్డి స్పందించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో తన అనుచరుడు చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్యతో వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబాలకు కేఎస్ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని సభ్యులు తెలిపారు.

మాజీ సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం

కులకచర్ల, ఫిబ్రవరి 28: కులకచర్ల మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ వెంకటమ్మ, మాజీ ఉప సర్పంచ్ మనెమ్మ, మాజీ వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామంలో చేపట్టిన కార్యక్రమాలపై అభినందించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఏవో వీరస్వామి, ఎంపీటీసీ రాంలాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.


తిరుమలాపూర్‌లో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన క్రిష్ణ

శామీర్‌పేట, ఫిబ్రవరి 28 : ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శామీర్‌పేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కాప్రా జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన తిప్పారపుమైన క్రిష్ణ(37) మంగళవారం రాత్రి శామీర్‌పేట నుంచి జమ్మిగడ్డకు వెళ్తుం డగా ఔటర్ సర్వీస్ రోడ్డులో ఫెయిలై నిలిచిన లారీని ఢీకొన్నాడు. దీంతో క్రిష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. క్రిష్ణ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ ...

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28 : బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా భార్య మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని పాత పంచాయతీ వద్ద ఉంటున్న వెంకటలక్ష్మి(55) బుధవారం భర్తతో కలిసి బైక్‌పై సుతారిగూడ నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా సీఎంఆర్ కళాశాల వైపు వెళ్తోంది. వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొంది. దీంతో వెంకటలక్ష్మి తలకు గాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. భర్త గాయపడ్డాడు. వారి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట.. పోలీసుల దాడి

పూడూరు, ఫిబ్రవరి 28: మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పది మందిపై కేసు నమోదు చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా మేరకు బుధవారం పూడూరు సమీపంలో గల ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని రూ.50,990, పది సెల్‌ఫోన్లు, 3 కార్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అక్రమ మద్యం పట్టివేత

కులకచర్ల, ఫిబ్రవరి 28: మండలంలోని కుసుమసముద్రంలో ఓ కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని యజమానిపై కేసు నమోదు చేశారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కుసుమ సముద్రంలోని బాలాజీ కిరాణాషాపులో తనిఖీ చేశారు. 12బీర్లు, 48 క్వార్టర్ సీసాలు లభించాయి. దుకాణ యజమాని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మైనర్ నిశ్చితార్థాన్ని నిలిపివేసిన అధికారులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28: ఓ మైనర్ నిశ్చితార్థాన్ని అధికారులు నిలిపివేసిన ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మండలానికి చెందిన పదో తరగతి బాలికకు మూసాపేట్‌కు చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు బాలిక తల్లిదండ్రులు గత ఆదివారం నిశ్చితార్థం పెట్టుకున్నారు. గ్రామస్తులు కొందరు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా అధికారులు గ్రామానికి చేరుకుని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక మేజర్ అయ్యేంత వరకు పెళ్లి చేయం అని రాయించుకుని నిశ్చితార్థాన్ని నిలిపేశారు.

సంక్షిప్తంగా...

● **తాండూరు రూరల్:** తాండూరులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు బ్రాంచ్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు ఉత్తమ సేవలందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్‌గుప్తా, బ్రాంచ్ మేనేజర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

● **కొడంగల్:** కొడంగల్‌లోని కార్గిల్ కాలనీలో మూడు రోజులుగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం, అర్చన, హోమ పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనలో భాగంగా ఆలయంలో ప్రజలకు అన్నదానం చేశారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ ఉప్పరిపల్లి పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఉప్పరిపల్లికి చెందిన పొలమోల్ల క్రిష్ణ-శాంతమ్మ, మురళీక్రిష్ణ-మౌనిక, మోహన్‌క్రిష్ణ-లావణ్య దంపతులు, వారి కుటుంబీకులు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

● **శామీర్‌పేట:** టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని టైలర్ల సంఘం నాయకులు కోకారు. లాల్‌గడీ మలక్‌పేటలో టైలర్స్ డే సందర్భంగా కేక్ కట్‌చేశారు. నాయకులు మాట్లాడుతూ టైలర్లు ఆర్థికంగా ఎదుగేందుకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రెడీమేడ్‌లతో టైలర్లు చితికి పోయారని వాపోయారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోమ రాము, మూడు చింతలపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి రాచర్ల శ్రీనివాస్, కోశాధికారి వెంకటేష్, సభ్యులు భానుచందర్, బల్‌రాం, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదవగలరని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో గల ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేయగా, కొందరు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిశుభ్ర, బలవర్ధక ఆహారాన్ని తినాలన్నారు. వ్యాయాయం చేయాలన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడం ప్రశంసనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే ఎన్ఎస్ఎస్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వోరవిసుధాకర్ పాల్గొన్నారు.

● **మర్పల్లి:** మండలంలోని రేణుక ఎల్లమ్మ, పరశురా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనను కోట మర్పల్లి గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 29న ఉదయం నూతన ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాప కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. నేటి నుంచి ప్రత్యేక పూజలతో విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చి 1న దేవతా విగ్రహాలకు ప్రతీ ఇంటి నుంచి బోనాలతో నైవేద్యాలు సమర్పించనున్నారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ 16వ వార్డు రాఘవేందర్‌నగర్ సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ఉమానాగరాజు ప్రారంభించారు. ప్రజావసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.